క్లుప్తంగా

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి

గోదావరిఖనిటౌన్: కోర్టు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని అందరికీ మెరుగైన సేవలు అందించాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఖని జిల్లా అదనపు న్యాయస్థానంలో బుధవారం మండల న్యాయ సేవాధికార ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టు సిబ్బంది వివిధ పనుల నిమిత్తం వచ్చే న్యాయవాదులకు, కక్షిదారులకు, పోలీసు సిబ్బందికి అవసరమైన సహాయం సహనంతో అందించాలని సూచించారు. కోర్టు సూపరింటెండెంట్ శ్రీధర్, విజయ, సారథి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు రౌడీ షీటర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. టూటౌన్ పరిధిలోని అనుమానితులను పిలిచి వారితో మాట్లాడారు. వారికి పలు సూచనలతో పాటు కౌన్సెలింగ్ చేశారు. మంచి ప్రవర్తనతో సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టూటౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్ రావు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకతాయిలపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, టూటౌన్ పరిధిలో ప్రతీరోజు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బైకులపై ట్రిపుల్ రైడింగ్ చేయకుండా మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. టూటౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా రవీందర్



సుల్తానాబాద్‌రూరల్: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు పిట్టల రవీందర్‌ను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రవీందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిలా అధ్యక్షుడు కర్రు సురేశ్, ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారుల ఇంటికే చెక్కులు



చెక్కులు అందిస్తున్న చంద్రశేఖర్

మంథని: మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి వ్యక్తిగత సహాయకుడు ఆకుల చంద్రశేఖర్ బుధవారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులు అందించారు. నియోజకవర్గంలోని మంథని, ముత్తారం మండలాలకు చెందిన 98 చెక్కులను అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

కొమిర యువకుడికి పీఈటీ ఉద్యోగం



ప్రశాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

ఓదెల: మండలంలోని కొమిర గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి అనే యువకుడు ఇటీవల డీఎస్సీలో ర్యాంకు సాధించి పీఈటీ ఉద్యోగం సాధించాడు. ప్రశాంత్‌రెడ్డిని బుధవారం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, నాయకులు చీకట్ల మొండయ్య, మాజీ ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి, ఆటో సమ్మయ్య సన్మానించారు.

ఘనంగా చండీ హోమం

జ్యోతినగర్: దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారి సన్నిధిలో చండీ హోమం నిర్వహించారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో కొలువుదీరిన అమ్మవారి సన్నిధిలో భక్తులు చండీ హోమం నిర్వహించారు.



చప్పట్లు కొడుతూ ఆడేవాళ్లం



యైటింక్లయిన్‌కాలనీ: బతుకమ్మ అంటేనే ఆడబిడ్డల పండుగ. తొమ్మిదిరోజుల పాటు ఆడబిడ్డలతో కలిసి ఆడుకొనే బతుకమ్మ పండుగ మాకు చాలా సంతోషంగా ఉంటుంది. చిన్నప్పటి నుంచి నానమ్మ, అమ్మమ్మలతో కలిసి చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడుకుంటూ ఆడుకునే వాళ్లం. ఇప్పుడు డీజేల పాటలతో కోలాటం ఆడుతున్నారు. – సుకన్య, యైటింక్లయిన్‌కాలనీ

మహిళలకు పెద్ద పండుగ



జూలపల్లి: బతుకమ్మ పండుగ వస్తోందంటే చెప్పలేని సంతోషం. బతుకమ్మ సొంత ఊరిలోనే ఆడుకుంటాం. కలిసి చదువుకున్న మిత్రులతో ఆడుకోవడమంటే చాలా ఇష్టం. వారం ముందే పండుగ కోసం ప్లాన్ చేసుకుంటాం. మహిళలకు బతుకమ్మ పెద్ద పండుగ. – అమరగాని సస్య, బీటెక్, జూలపల్లి

పూల కోసం మార్కెట్‌కే..



రామగుండం: కొన్నేళ్ల క్రితం వరకు మా ఇంటి వైపు ఉన్న తంగెడు పువ్వు కోసం వివిధ ప్రాంతాల నుంచి చాలా మంది వచ్చి తెంపుకునేవారు. ఇప్పుడు పూలకోసం మార్కెట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. గత జ్ఞాపకాలు నా కూతుళ్లకు చెప్తుంటే ఆసక్తిగా వింటారు. – శ్రీదేవి, విద్యుత్‌నగర్, రామగుండం



ఎలిగేడులో సరస్వతీదేవి అవతారంలో..



రామగుండం: బోనంతో కార్పొరేటర్ కౌశిక లత



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లిలో ప్రత్యేక పూజలు



ఓదెల: పొత్కపల్లిలో కుంకుమ పూజలు

నైవేద్యాలు.. ప్రత్యేక పూజలు

దుర్గామాత దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఏడో రోజు అమ్మవారు భక్తులకు సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. దుర్గామాత మండపాల్లో అన్నసంతర్పణ కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రామగిరి: పన్నూర్ భవాని యూత్ ఆధ్వర్యంలో..

ఘనంగా బతుకమ్మ వేడుకలు



కోల్‌సిటీ: జీజీహెచ్ ఆస్పత్రిలో..

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో బుధవారం రాత్రి వైద్యులు, సిబ్బంది బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ వేడుకలకు హాజరయ్యారు. డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలు బతుకమ్మ ఆడిపాడారు.

జీఎం కార్యాలయంలో..

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం జీఎం కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో వివిధ విభాగాల మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు.

ఎంపీడీవో కార్యాలయంలో..



రామగిరి: బతుకమ్మ వేడుకల్లో అధికారులు



యైటింక్లయిన్‌కాలనీ: జీఎం కార్యాలయంలో..

రామగిరి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శైలజారాణి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఆర్డీవో హనుమా నాయక్, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీవో ఉమేశ్, ఈసీ లక్ష్మణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లు జాబితాలో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు నవంబర్6లోపు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆర్డీవో హనుమానాయక్ సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువుపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఆయా పార్టీల నాయకులు సమ్మయ్య, అజీంఖాన్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేలా సన్నద్ధం

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదులో యువత ముందున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం రామునిపల్లిలోని 241వ బూత్‌లో బుధవారం ఇంటింటికీ వెళ్లి నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారం దిశగా అడుగులు వేస్తోందని, రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేలా కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు ఇగురం రామస్వామి, కొమ్మిడి కుమార్ రెడ్డి, ఆకుల లక్ష్మణ్, మెంగాని కుమార్, శ్రీరంగం అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం వైపు యువత చూపు

ఓదెల: దేశంలో పీఎం నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చూసి బీజేపీ సభ్యత్వం స్వీకరించేందుకు యువత ఆసక్తి చూపుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొత్కపల్లిలో బుధవారం 171, 172, 173వ బూత్‌లలో బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులు పృథ్వీరాజ్, ఆళ్ల తిరుపతిరెడ్డి, బండారు వినోద్, రెడ్డి గణేశ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న సురేశ్‌రెడ్డి

ఈశ్వర్‌కృప వృద్ధాశ్రమం తనిఖీ



వృద్ధాశ్రమంలో ఆర్డీవో గంగయ్య

ఫెర్టిలైజర్‌సిటీ: వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర్‌కృప వృద్ధాశ్రమాన్ని ఆర్డీవో గంగయ్య బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఆశ్రమంలోని వృద్ధులను సంరక్షించడం కోసం ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామన్నారు. జిల్లా సంక్షేమాధికారి రవుఫ్‌ఖాన్, తహసీల్దార్ కుమారస్వామి, ఆశ్రమ నిర్వాహకులు పీటీ స్వామి, గంట సత్తయ్య, ఎల్.మాధవరెడ్డి, పుప్పాల గీతాదేవి, వెంకటయ్య, రామచందర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు

సుల్తానాబాద్: బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తెలిపారు. బుధవారం మున్సిపల్ ప్రాంతంలో పలు చెరువులు, కుంటలలో నిమజ్జనం చేయడానికి ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ అలీమోద్దీన్ పాల్గొన్నారు.

ఓదెల మండలంలో..

ఓదెల: మండలంలో బతుకమ్మ నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం జరిగే బతుకమ్మ నిమజ్జనానికి మహిళలు ఇబ్బంది పడకుండా చెరువులు, మత్తళ్లు, మానేరుల వద్ద ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీవో షబ్బీర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ కోసం బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువుల వద్ద బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో స్థలాలను చదును చేసి లైట్లు ఏర్పాటు చేశారు.

• బాధ్యతలు స్వీకరణ

రామగిరి: మండల ప్రత్యేకాధికారిగా బుధవారం మంథని ఆర్డీవో హనుమానాయక్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులను కలెక్టర్ కోయ శ్రీహర్ష నియమించగా రామగిరి మండల ప్రత్యేకాధికారిగా ఆర్డీవో హనుమా నాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

• ముందస్తు నివేదికలపై సమీక్ష

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఎంపీడీవో అలీం సందర్శించారు. పంచాయతీలో వెచ్చించాల్సిన వ్యయాలు, ప్రాధాన్యత వ్యయాలు, మూలధన వ్యయ ప్రణాళిక తయారీ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీవో వేణుగోపాల్, కార్యదర్శి రాజిరెడ్డి ఉన్నారు.

• లాలపల్లి రెడ్డి సంఘం చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గ్రామ రెడ్డి సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం చైర్మన్‌గా ఏలేటి వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, క్యాషియర్‌గా బద్దం తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ముత్యాల తిరుపతిరెడ్డి, గుర్రం రాఘవరెడ్డి, యాల్ల మల్లారెడ్డి, కోమటిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోమటి రెడ్డిరాంరెడ్డి, గడ్డం శ్రీనివాసరెడ్డి, కొప్పెర ముత్యంరెడ్డి, గడ్డం మల్లారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

• చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడు మృతి

ముత్తారం: మండలంలోని మచ్చుపేటకు చెందిన కోట సతీశ్(36) అనే సింగరేణి కార్మికుడు కడుపు నొప్పి భరించలేక 8న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని సింగరేణి ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చనిపోయాడు. మృతుడికి భార్య అనిత ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

• దసరా తర్వాత బడాఖానా ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల కోసం నిర్వహించే బడాఖానా దసరా తర్వాత నిర్వహించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లలో బిజీగా ఉంటారని, ఈక్రమంలో పండుగ తర్వాత నిర్వహిస్తే బాగుంటుందన్నారు. బడాఖానా (విందు భోజనం) పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలనే యాజమాన్యం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

• కొలనూర్‌లో బైక్ చోరీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్ గ్రామంలో పిట్టలఎల్లయ్యపల్లె గ్రామానికి చెందిన పాల సదయ్య బైక్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. రైల్వేగేట్ సమీపంలో బైక్‌ను పార్క్ చేసిన సదయ్య.. పనినిమిత్తం ఊరుకు వెళ్లాడు. మళ్లీ వచ్చి చూశాక బైక్ కనిపించలేదని బాధితుడు ఆవేదన చెందాడు.

• వివాహిత అనుమానాస్పద మృతి

ధర్మారం: మండలంలోని బుచ్చయ్యపల్లికి చెందిన సత్తరం కోమలత (32) అనే వివాహిత మంగళవారం రాత్రి అనుమానాస్పదంగా మరణించినట్లు ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. కోమలత గుండె పోటుతో గానీ మరేదైనా కారణాలతో మరణించి ఉంటుందని మృతురాలి సోదరుడు గట్టు రమేశ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• పారిశుధ్య కార్మికులకు పాదరక్షలు, సబ్బులు పంపిణీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు బుధవారం పాదరక్షలు, కొబ్బరి నూనె, సబ్బులు, బెల్లం మేయర్ బంగి అనిల్‌కుమార్, అదనపు కలెక్టర్, కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ సెక్రటరీ రాజు, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

• ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

ధర్మారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోకల నాగయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. టీఎల్ఎఫ్ మండల అధ్యక్షుడు కేవీఆర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సత్యనారాయణరాజు, గౌరవ అధ్యక్షుడు మల్లేశం, రత్నాకర్, అంజయ్య, కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

• పెద్దపల్లిలో కాన్షీరాం వర్ధంతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా కూడలిలో బుధవారం కాన్షీరాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కాన్షీరాం విగ్రహానికి మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ, నాయకులు దాసరి ఉష, శ్రీమాన్ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు రవి, అంజయ్య, రాజేందర్, భూమయ్య, కాంతయ్య, అరుణ, రాహుల్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెక్కుల పంపిణీ



కాంట్రాక్టు కార్మికులతో జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల బోనస్ చెక్కులను బుధవారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ పంపిణీ చేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వంద మస్టర్లు పూర్తిచేసిన 641మంది కాంట్రాక్టు కార్మికులందరికీ రూ.5వేల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. యూనియన్ నాయకులు మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, క్వాలిటీ సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మి, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

వేడుకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం ఎస్.రాధాకృష్ణ ఆదేశించారు. సెంటినరీకాలనీ రాణిరుద్రమ దేవి క్రీడాప్రాంగాణంలో బుధవారం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. గురువారం సాయంత్రం 6గంటల నుంచి సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలు ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతితో పాటు పది ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలతో విచ్చేసి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీవైపీఎం సునీల్ ప్రసాద్, సివిల్ డీవైఎస్ఈ ఎస్.రామకృష్ణ, సూపర్‌వైజర్ యాకుబ్ పాషా పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు



బహుమతి అందుకున్న క్రీడాకారులతో ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ

గోదావరిఖని: రెండురోజుల పాటు ఆర్జీ–2 ఏరియా సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన సింగరేణి స్థాయి బ్యాడ్మింటిల్, టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు జీఎం ఎల్వీ సూర్యనారాయణ బహుమతులు అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 23, 24, 25వ తేదీల్లో నిర్వహించే కోలిండియా పోటీలకు సింగరేణి జట్టు తరఫున పాల్గొంటారని అధికారులు తెలిపారు. యూనియన్ నాయకులు జీగురు రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షులు మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావ్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, ఆర్జీ–1 ఏరియా సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, అశోక్, ఆర్జీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పోశం పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత



స్పందించిన 2023 బ్యాచ్ మెడికోలు (ఫైల్)

కోల్‌సిటీ: డాక్టర్ కావాలని కష్టపడి చదివిన ఓ నిరుపేద విద్యార్థిని కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ.. ఫీజు కట్టలేని దీనస్థితిలో ఉంది. విషయం తెలిసిన గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లోని 2023 ఇన్సెండియోజ్ బ్యాచ్‌కు చెందిన మెడికల్ స్టూడెంట్స్ స్పందించారు. బుధవారం సాయంత్రం రూ.10వేల వరకు సేకరించిన మెడికోలు, బాధిత విద్యార్థినికి ఆన్‌లైన్‌లో ఆర్థికసాయం పంపించారు. మహబూబ్‌నగర్ జిల్లా సింహగిరి ప్రాంతానికి చెందిన నిరుపేద భాగ్యలక్ష్మి సిద్దిపేట జిల్లాలోని సురభి మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కానీ ఇంట్లో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులతో, ఎంబీబీఎస్ అడ్మిషన్ కోసం తొలుత రూ.1.40లక్షల వరకు ఫీజు కట్టలేక ఆందోళనకు గురవుతోంది. బాధితురాలి దీనస్థితిపై 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన 'డాక్టర్ కలకు ఆర్థిక కష్టాలు' అనే శీర్షిక.. గోదావరిఖని సిమ్స్ మెడికల్ స్టూడెంట్స్ హృదయాలను కదిలించింది. రూ.10వేలు సేకరించి బాధితురాలికి ఆన్‌లైన్‌లో పంపించారు.

మురుగు కాలువలోకి విషరసాయన వ్యర్థాలు వదలొద్దు



వినతిపత్రం అందజేస్తున్న మేయర్, కార్పొరేటర్లు

కోల్‌సిటీ/ఫెర్టిలైజర్‌సిటీ: జనావాసాల్లోని మురుగు నీటి కాలువలోకి ఆర్ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న విష రసాయన వ్యర్థాలు వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు కోరారు. బుధవారం ఆర్ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శరవణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ కారణంగా కాలుష్యంతో బాధపడుతున్న వీర్లపల్లికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. స్థానికులకే ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపయోగపడేలా ఉచిత కోచింగ్

మంథని: నిరుద్యోగులకు అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ త్వరలో ప్రారంభించనున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్, నిరుద్యోగుల సమస్యల సాధనకు కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. 30ఏళ్లుగా విద్యార్థుల సంక్షేమం కోసం అనేక సేవలు అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం మంథనిలో పర్యటించి వివిధ వర్గాల ప్రజలను కలిసి తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని కోరారు.

16న అలయ్.. బలయ్

గోదావరిఖని: సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని 16న గోదావరిఖని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో అలయ్.. బలయ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సామాజిక ఐక్యవేదిక జిల్లా కన్వీనర్, బీజేపీ నాయకులు వెంకటరమణ తెలిపారు.